కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ



లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్: అర్హులైన ప్రజలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. బుధవారం భోలక్‌పూర్ డివిజన్‌లోని అంజుమన్‌హాల్‌లో ముషీరాబాద్, హిమాయత్‌నగర్ తహశీల్దార్ పరిధిలోని 81 మందికి షాదీముబారక్, 9 మందికి కల్యాణలక్ష్మి చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వివిధ ప్రభుత్వ పథకాల కోసం దరఖాస్తు చేసుకున్న వారి దరఖాస్తులను పరిశీలించి లబ్ధి చేకూర్చాలని అధికారులకు సూచించారు. బీఆర్‌ఎస్ యువనేత ముఠా జైసింహ, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు రహీం, డివిజన్ మాజీ అధ్యక్షుడు మహ్మద్‌అలీ, డివిజన్ ఉపాధ్యక్షులు శంకర్‌గౌడ్, చాంద్‌పాషా, సీనియర్ నాయకుడు దీన్‌దయాల్‌రెడ్డి, వంగాల నర్సింగ్ రావు, కళ్యాణ్, మున్వర్‌చాంద్, ముషీరాబాద్ డిప్యూటీ తహశీల్దార్ హేమంత్, ఆర్‌ఐలు కృష్ణ, నూతన, రేష్మా, రాధా తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేత



వినతిపత్రం అందజేస్తున్న కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమారమేష్

కాచిగూడ: డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో రోడ్లు పూర్తిగా చెడిపోయి స్థానిక ప్రజలు, వాహనదారులు నిత్యం తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని స్థానిక కార్పొరేటర్ కన్నె ఉమారమేష్‌యాదవ్ అన్నారు. వివిధ ప్రాంతాల్లో సీసీ రోడ్ల ఏర్పాటుకు నిధులు మంజూరైనా పనులు ఇంకా ప్రారంభించలేదని, పనులు వెంటనే ప్రారంభమయ్యేలా చూడాలని కోరుతూ.. బుధవారం జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్ రవికిరణ్‌ను కార్పొరేటర్ కలిసి వినతిపత్రం అందజేశారు. డివిజన్‌లోని చప్పల్‌బజార్, లాల్‌బహదూర్ స్కూల్‌లేన్, జమాల్‌బస్తీ, ఏకే భవన్, మహాలక్ష్మి డెయిరీ వెనుక వైపు, కాచిగూడ పెట్రోల్ బంక్ లేన్, బాలప్పబాడ తదితర ప్రాంతాల్లో నూతన సీసీరోడ్లకు నిధులు మంజూరైనా పనులు ప్రారంభం కాలేదని ఆమె పేర్కొన్నారు. పలు ప్రాంతాల్లో ప్యాచ్‌వర్క్స్ చేయాల్సి ఉండగా.. చేపట్టడం లేదని తెలిపారు. నారాయణగూడ మోడల్ మార్కెట్‌ను వెంటనే ప్రారంభించాలని కోరారు. ఫీవర్ ఆస్పత్రి బ్రిడ్జి నుంచి నారాయణగూడ బ్రిడ్జి వరకు హుస్సేన్‌సాగర్ నాలా రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులను ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు.

స్థానిక సమస్యలపై..

అంబర్‌పేట్: ప్రజలకు మెరుగైన వసతులు కల్పించాలని కార్పొరేటర్లు డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్‌రెడ్డి ఆధ్వర్యంలో జీహెచ్‌ఎంసీ సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ ఎన్.రవికిరణ్‌ను కలిశారు. బుధవారం ఆయన కార్యాలయంలో కార్పొరేటర్లు కన్నె ఉమారమేష్‌యాదవ్, దూసరి లావణ్య శ్రీనివాస్‌గౌడ్, అమృత స్థానిక సమస్యలపై జోనల్ కమిషనర్‌కు వివరించారు. హిందూ శ్మశానవాటిక అభివృద్ధి, డ్రైనేజీ, తాగునీరు, సీసీ రోడ్లు, వీధిలైట్లు వంటి సమస్యలను జోనల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. అధికారులు, నాయకులు కన్నె రమేష్‌యాదవ్‌గౌడ్, దూసరి శ్రీనివాస్‌గౌడ్ తదితరులున్నారు.

క్రమశిక్షణతో చదివితే పోటీ పరీక్షల్లో విజయం



పూజల్లో నగర అదనపు కలెక్టర్ కదిరవన్, కార్యదర్శి పద్మజ

చిక్కడపల్లి: పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు సమయపాలన పాటిస్తూ.. క్రమశిక్షణతో చదవడం, రాయడం ద్వారా విజయం సాధిస్తారని హైదరాబాద్ నగర గ్రంథాలయ సంస్థ పర్సన్ ఇన్‌చార్జి, నగర అదనపు కలెక్టర్ పలని కదిరవన్ అన్నారు. చిక్కడపల్లిలోని నగర కేంద్ర గ్రంథాలయంలో బుధవారం కార్యదర్శి పొట్లూరి పద్మజ ఆధ్వర్యంలో వసంత పంచమి సందర్భంగా సరస్వతి మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలని కదిరవన్ పోటీ పరీక్షలకు విద్యార్థులు సన్నద్ధంపై పలు సూచనలు చేశారు. కార్యదర్శి పద్మజ, ఉద్యోగులు అవినాష్, బొల్లం మహేందర్, సుకేష్, మదన్‌మోహన్, వేంకటేశ్వర్‌రెడ్డి, రామ్మోహన్, వరప్రసాద్, సుబ్బలక్ష్మి, సీతామహాలక్ష్మి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బుక్‌ఫెయిర్‌లో ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు



అనీలా ఆర్ట్స్ అకాడమీ అభ్యుదయ స్కూల్ విద్యార్థుల నృత్య ప్రదర్శన

కవాడిగూడ: గద్దర్ ప్రాంగణం (ఎన్టీఆర్ స్టేడియం)లో నిర్వహిస్తున్న 36వ హైదరాబాద్ బుక్‌ఫెయిర్ ఉత్సాహపూరిత వాతావరణంలో కొనసాగుతుంది. ఈ సందర్భంగా పుస్తక ప్రదర్శన ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఫుడ్‌స్టాల్స్ నోరూరిస్తున్నాయి. ఈ సందర్భంగా రవ్వా శ్రీహరి వేదికపై విద్యార్థులు ప్రదర్శిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. బుధవారం ఈ సందర్భంగా హైదరాబాద్ బుక్‌ఫెయిర్ కమిటీ ఆధ్వర్యంలో పలు పుస్తకాలను ఆవిష్కరించారు. యువరచయిత అమృతరాజు రచించిన పిలుపు పుస్తకాన్ని ఆవిష్కరించారు. కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కార అవార్డు గ్రహీతలు డాక్టర్ పసునూరి రవీందర్, మెర్సీ మార్గరేట్, మానవ హక్కుల ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి దిలీప్, కులనిర్మూలన సంఘం ప్రధాన కార్యదర్శి బూరం అభినవ్ తదితరులు పాల్గొన్నారు.

● కవి విమర్శకుడు లక్ష్మీనర్సయ్య మాట్లాడుతూ.. దేశంలో సాంస్కృతం, హిందీభాష మాత్రమే ఉండాలని ఆ రెండింటినీ దేశంపై రుద్దుతాను అనడం సరికాదన్నారు. ఒక మతానికి వ్యతిరేకంగా వ్యతిరేకతను పెంచే విధానాలు సరికావన్నారు. బుక్‌ఫెయిర్ అధ్యక్షుడు జూలూరి గౌరీశంకర్, జూపాక సుభద్ర, ప్రముఖ విశ్లేషకులు తిలకపల్లి రవి, ఎస్. వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

గోవుల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత



అఖిల భారత గోసేవ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు బాలకృష్ణ తదితరులు

కవాడిగూడ: గోవులను రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అఖిల భారత గోసేవ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు బాలకృష్ణ అన్నారు. గోవును జాతీయ జంతువుగా గుర్తించాలని ఆయన డిమాండ్ చేశారు. బుధవారం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని గోశాల ప్రాంగణంలో అఖిల భారత గోసేవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ గో ప్రేమికుల దినోత్సవం నిర్వహించారు. ప్రేమికుల దినం వద్దు... గోసేవ ముద్దు అంటూ గోశాల ప్రాంగణంలో ×సేవ్ కౌ హగ్ డే×ను చేపట్టారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ సభ్యులు గోవులను ఆలింగనం చేసుకుని ప్రత్యేక పూజలు చేశారు. గోశాల వద్ద ర్యాలీ నిర్వహించి నినాదాలు చేశారు. బాలకృష్ణ, సిద్దిపేట గోశాల పీఠాధిపతి వీరధర్మజస్వామి, గోరక్షణ సమితి ఇన్‌చార్జి రామారావు, సంజీవ్‌కుమార్‌గుప్తా, సి.డి చౌహాంగ్, ఝాన్సీ, శ్రీలక్ష్మి, మహేశ్వరి గోవులకు ప్రత్యేక పూజలు చేశారు.

టీబీ రోగులకు పౌష్టికాహారం కిట్ల పంపిణీ

ముషీరాబాద్: ముషీరాబాద్ టీబీ యూనిట్ ఆస్పత్రి ప్రాంగణంలో మిధాని సంస్థ ఆధ్వర్యంలో బుధవారం 70 మంది టీబీ రోగులకు పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా టీబీ ఆస్పత్రి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. సకాలంలో మందులు వాడితే టీబీ రోగం నయమవుతుందన్నారు. ఈ వ్యాధి సోకినా.. భయపడాల్సిన అవసరం లేదని, మంచి ఆహారం తీసుకోవాలని సూచించారు. టీబీ ఆస్పత్రి సిబ్బంది పరమేష్, సందీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పాత విద్యుత్ స్తంభం తొలగింపు..

చిక్కడపల్లి: చిక్కడపల్లి వివేక్‌నగర్‌లో చాలాకాలంగా తుప్పుపట్టిన విద్యుత్ స్తంభాన్ని ఎట్టకేలకు సిబ్బంది తొలగించారు. బుధవారం వివేక్‌నగర్‌కు చేరుకున్న సిబ్బంది ఏఈ పవన్ పర్యవేక్షణలో తుప్పుపట్టి ఒరిగిన స్తంభాన్ని తొలగించి కొత్త దానిని ఏర్పాటు చేశారు. స్థానికుల ఫిర్యాదుతో స్పందించిన అధికారులు సిబ్బందితో కలిసి పని పూర్తి చేశారు. కాగా స్తంభానికి ఉన్న కేబుల్ టీవీ, ఇంటర్నెట్ వైర్లతో తీవ్ర ఇబ్బంది పడ్డారు.

సరస్వతీ నమోస్తుతే





వసంత పంచమి వేడుకల్లో పాల్గొన్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

అంబర్‌పేట్/ ముషీరాబాద్ జోన్ పరిధిలో వసంత పంచమి సందర్భంగా బుధవారం సరస్వతి దేవీ, అమ్మవారి ఆలయాలు భక్తులతో పోటెత్తాయి. ఈ వేడుకల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సహా పలువురు స్థానిక నేతలు అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయాల్లో భక్తులు కుంకుమార్చనతో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

– అంబర్‌పేట్/ ముషీరాబాద్ జోన్ల బృందం



ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, తదితరులు



కుంకుమార్చన చేస్తున్న అర్చకస్వామి



శంకరమఠంలో సరస్వతి అలంకరణలో..

రైలు దిగుతూ ప్రమాదవశాత్తు మహిళ మృతి

కాచిగూడ: రైలు దిగుతూ ప్రమాదవశాత్తు ఓ మహిళ కిందపడి గాయాలతో మృతి చెందిన ఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. బుధవారం రైల్వే హెడ్ కానిస్టేబుల్ వీఎల్ చారి తెలిపిన వివరాల ప్రకారం.. తమిళనాడు స్టేట్, మధురై జిల్లాకు చెందిన చిన్నస్వామి భార్య ముత్తు సెల్వీ (22) కాచిగూడ రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫారం 5లో చెంగల్పట్టు రైలు దిగుతుండగా.. ప్రమాదవశాత్తు కింద పడింది. తీవ్రంగా గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం ఉస్మానియా జనరల్ ఆస్పత్రికి తరలించగా ఆమె అప్పటికే మృతి చెందింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనారోగ్యంతో ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య



నిఖిత (ఫైల్)

చిక్కడపల్లి: గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థిని ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన దోమలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. దోమలగూడ తాళ్లబస్తీలో నివాసం ఉండే బీంరాజ్ దంపతులకు ఓ కుమార్తె ఎస్.నిఖిత(17), ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. చిన్న కుమార్తె నిఖిత నారాయణగూడలోని ఓ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతుంది. గత ఆరు నెలలుగా నిఖిత అనారోగ్యంతో బాధపడుతుంది, మంగళవారం రాత్రి తల్లిదండ్రులు ఉద్యోగాలకు వెళ్లగా.. ఇంట్లో ఎవరూలేని సమయంలో నిఖిత కిటికీ గ్రిల్‌కు చున్నీతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కొద్దిసేపటికీ ఇంటికి చేరుకున్న కుటుంబసభ్యులు వచ్చి తలుపు మూసి ఉండటంతో స్థానికుల సాయంతో తలుపు తీసి చూడగా.. ఉరేసుకుని కనిపించింది. దీంతో వారు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై సాయికృష్ణ ఘటనా స్థలానికి చేరుకుని ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతిచెందినట్లు డాక్టర్లు ధ్రువీకరించారన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి..



దేవిదాస్ (ఫైల్)

అంబర్‌పేట్: అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మంగళారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ అశోక్ తెలిపిన వివరాల ప్రకారం మహారాష్ట్రకు చెందిన దేవిదాస్ (34) జీవనోపాధికోసం గోల్నాక శాంతినగర్‌కు వచ్చి కాచిగూడ రైల్వేస్టేషన్ సమీపంలో టీ అమ్ముకొనేవాడు. ఇతడికి భార్య ఇద్దరు కూమార్తెలు సంతానం. కాగా ఇటీవలే భార్యా పిల్లలు స్వస్థలానికి వెళ్లారు. దేవిదాస్ ఇంట్లో ఒంటరిగా ఉండి రాత్రి ఉరేసుకుని కనిపించాడు. అర్ధరాత్రి వరకు ఇతను ఉంటున్న ఇంట్లో నుంచి ఎలాంటి అలికిడి రాకపోవడంతో సమీపంలో ఉండే బంధువులు తలుపు తట్టగా.. స్పందించకపోవడంతో స్థానికుల సహకారంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యావంతులు పార్టీకి అండగా నిలవాలి



బీజేపీ పార్లమెంట్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న కిషన్‌రెడ్డి, డాక్టర్ కె.లక్ష్మణ్

కాచిగూడ: దేశాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్లే శక్తి నరేంద్రమోదీకే ఉందని, లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు, ముఖ్యంగా విద్యావంతులు, మేధావులు ప్రధాని, బీజేపీకి అండగా నిలవాలని బీజేపీ ఓబీసీ మోర్చ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్ విజ్ఞప్తి చేశారు. బుధవారం బర్కత్‌పురలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ కార్యాలయాన్ని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్ రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో మెజార్టీ స్థానాల్ని గెలుచుకుంటామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. నరేంద్రమోదీ ప్రధాని అయ్యాక.. ప్రపంచమంతా దేశం వైపు చూస్తోందని ఆయన అభిప్రాయపడ్డారు. దేశం సుభిక్షంగా ఉండాలంటే మోదీనే తిరిగి ప్రధాని కావాలని ఆకాంక్షించారు. బీజేపీ నాయకులు డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు, పార్టీ నేతలు కృష్ణ యాదవ్, మర్రి శశిధర్‌రెడ్డి, చంద్రశేఖర్, కన్నె ఉమా రమేష్‌యాదవ్, సూర్యప్రకాష్‌సింగ్, ఎ.యశ్వంత్, కె.ప్రవీణ్, సుభాష్ పటేల్, చుక్కా జగన్, రమేష్ రాము, కేసరి నర్సింగ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిన రాథోడ్ మోహన్‌నాయక్



ముషీరాబాద్: ఇన్‌కమ్ ట్యాక్స్ డిపార్ట్‌మెంట్ మాజీ కమిషనర్, ఐఆర్‌ఎస్ అధికారి రాథోడ్ మోహన్‌నాయక్ బుధవారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కిషన్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా మోహన్‌నాయక్‌కు కండువా కప్పి బీజేపీలోకి కిషన్‌రెడ్డి ఆహ్వానించారు. అనంతరం మోహన్‌నాయక్ మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్ల హిందువుల కల అయిన అయోధ్య రామాలయం నిర్మించి దేశ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చారని తెలిపారు. దేశాభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్న ప్రధాని మోదీ విజన్ నచ్చి తనవంతుగా ఆయనకు మద్దతు పలికేందుకు బీజేపీలో చేరినట్లు వివరించారు. ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్‌తో కలిసి బీజేపీ పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానన్నారు. బీజేపీ సీనియర్ నేతలు నేతి రాజేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కులాంతర వివాహితుల ఆత్మీయ సమ్మేళనం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం, కేవీపీఎస్, ఎస్‌వీకే సంయుక్తాధ్వర్యంలో బుధవారం సాయంత్రం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రేమికుల దినోత్సవం సందర్భంగా కులాంతర వివాహితుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా ప్రొఫెసర్ తిరుమలి మాట్లాడుతూ.. గాలి, నేలకు లేని కులం మనుషులకు ఉండటాన్ని ఆయన ప్రశ్నించారు. కులాంతర వివాహాలు చేసుకున్న ప్రేమికులకు ప్రత్యేక రక్షణ చట్టం తీసుకురావాలని ఆయన కోరారు. ఎస్‌వీకే కార్యదర్శి ఎస్.వినయ్‌కుమార్, రాములు, టీపీఎస్‌కే కన్వీనర్ భూపతి వేంకటేశ్వర్లు, బుచ్చిరెడ్డి, కేవీపీఎస్ ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌బాబు, సుజావతి తదితరులు పాల్గొన్నారు.

గంగపుత్రుల సంక్షేమానికి ఏఎల్ మల్లయ్య విశేష కృషి



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్, గంగపుత్ర సంఘం నేతలు

కవాడిగూడ: తెలంగాణ ప్రదేశ్ గంగపుత్ర సంఘం అధ్యక్షుడిగా ఆంధ్రప్రదేశ్ ఫిషరీస్ కో– ఆపరేటివ్ చైర్మన్, తెలంగాణ బీసీ–ఏ కులాల హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడిగా దివంగత ఏఎల్ మల్లయ్య అందించిన సేవలు మరువలేమని పలువురు వక్తలు కొనియాడారు. బీసీలంతా ఆయన ఆశయ సాధనకోసం పాటుపడాలని అప్పుడే ఆయనకు నిజమైన నివాళి అవుతుందన్నారు. ఏఎల్ మల్లయ్య ప్రథమ వర్ధంతి సందర్భంగా బుధవారం కవాడిగూడ బండమైసమ్మనగర్‌లోని ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే ముఠాగోపాల్, బీఆర్‌ఎస్ యువజన విభాగం నాయకులు ముఠా జైసింహా, బీసీ హక్కుల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు బాగయ్య, సమితి అధ్యక్షుడు ఎంఎస్ నరహరి, సుల్తాన్‌బజార్ ఏసీపీ సంపత్‌కుమార్, తెలంగాణప్రదేశ్ గంగపుత్ర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడప శ్రీహరి, ఉపాధ్యక్షులు శివరత్నం, ఆర్.కె. భగవాన్, బాలయ్య, సెక్రెటరీ ఓం ప్రకాష్, చంద్రప్రకాష్, కోశాధికారి ఎర్రబోయిన మల్లేష్, మహిళాసంఘం నాయకులు స్వర్ణలత, సంగీత, మాధవి లత, సునీత, యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అంబటి మల్లయ్య, సుధాకర్ గంగపుత్ర, ఉపాధ్యక్షులు కట్ట నర్సింగ్, తెలంగాణప్రదేశ్ గంగపుత్ర ఉద్యోగ సంఘం అధ్యక్షుడు లక్ష్మణ్, నాయకులు ముఠా గణేష్, కోటేష్, రాంచందర్, నర్సింహులు హాజరై ఆయన విగ్రహానికి నివాళులర్పించారు.

ముషీరాబాద్: గంగపుత్రుల సమస్యల పరిష్కారం, హక్కుల పరిరక్షణకు ఏఎల్ మల్లయ్య అందించిన సేవలు మరువలేనివని గంగపుత్ర సంఘం గ్రేటర్ ఉపాధ్యక్షుడు గాండ్ల ప్రసాద్ కొనియాడారు. బుధవారం ముషీరాబాద్ గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో ప్రథమ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఆలిండియా గంగపుత్ర సంఘం ఉపాధ్యక్షుడు పూస గోరఖ్‌నాథ్, సీనియర్ నాయకులు బిజ్జి రవి, శ్యామ్‌కుమార్, గోవింద్, సాయి తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గాండ్ల ప్రసాద్ మాట్లాడుతూ.. నిరంతరం గంగపుత్రుల హక్కుల కోసం పోరాడిన ఏఎల్ మల్లయ్య సేవలను ప్రభుత్వం గుర్తించి ఆయన జయంతి, వర్ధంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని కోరారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్తదాన శిబిరంలో కార్పొరేటర్ రవిచారి తదితరులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రక్తదానం ప్రాణదానంతో సమానమని రాంనగర్ డివిజన్ కార్పొరేటర్ కె.రవిచారి అన్నారు. యువతీయువకులు రక్తదాన శిబిరాల్లో పాల్గొని ఇతరుల ప్రాణాల కాపాడేందుకు సహాయపడాలని ఆయన సూచించారు. బుధవారం ఆయన పుట్టినరోజు సందర్భంగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం పేదలకు చీరల పంపిణీ, అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. వివేకానందుడి స్ఫూర్తితో యువత సామాజిక స్పృహను పెంపొందించుకోవాలన్నారు. యువత ఈ దేశానికి వెనెముక అని, ఏదైనా సాధించగలిగే శక్తి ఉంటుందని అందుకే ఇలాంటి సామాజిక సేవా కార్యక్రమాల్లో బాగస్వాములు కావాలని కోరారు. బీజేపీ నాయకులు రాహుల్, ధనరాజ్, శ్రీనివాస్‌గౌడ్, బాలరాజ్, కిరణ్, సుమంత్, లల్లూ, మహేష్, రవి, శ్రీకాంత్, రాకేష్, సుదర్శన్, రమాకాంత్ తదితరులు పాల్గొన్నారు.

శివాజీ జయంతిని సెలవు దినంగా ప్రకటించాలని వినతి

కాచిగూడ: చత్రపతి శివాజీ మహారాజ్ జయంతి ఫిబ్రవరి 19న సెలవు దినంగా ప్రకటించాలని చత్రపతి శివాజీ మహారాజ్ ఫౌండేషన్ చైర్మన్ సీడీ చవాన్ బుధవారం సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎంను కలిసి శివాజీ జయంతి రోజున సెలవు ప్రకటించాలని కోరగా.. ఆయన సానుకూలంగా స్పందించారన్నారు. శివాజీ జయంతిని పెద్దఎత్తున నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

బీసీ విద్యార్థులకు రాయితీ కల్పించాలి

కాచిగూడ: ఉస్మానియా యూనివర్సిటీ విడుదల చేసిన 'టీఎస్ ఈసెట్ –2024' నోటిఫికేషన్‌తో దరఖాస్తు చేసుకునే ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల మాదిరిగా బీసీ విద్యార్థులకు దరఖాస్తు రుసుంలో రాయితీ కల్పించాలని బీసీ విద్యార్థి సేన రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈనెల 15 నుంచి ఏప్రిల్ 16వ తేదీ వరకు విద్యార్థులు దరఖాస్తు చేసుకునే అవకాశం యూనివర్సిటీ కల్పించిందని ఆయన తెలిపారు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.500, ఇతరులకు రూ.900లుగా దరఖాస్తు ఫీజు ఉందని, వివరించారు.

గృహజ్యోతి లబ్ధిదారుల ఎంపికకు బస్తీబాట

కాచిగూడ: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన గృహజ్యోతి పథకం ద్వారా అర్హులను గుర్తించేందుకు విద్యుత్ అధికారులు, సిబ్బంది బస్తీబాట పట్టారు. ఉచిత విద్యుత్‌ను వాడుకునేందుకు అర్హులైన లబ్ధిదారులను గుర్తించేందుకు ఇంటింటికి తిరిగి వారి నుంచి దరఖాస్తులను సేకరిస్తున్నారు. బుధవారం కాచిగూడ డివిజన్ రహమత్‌బాగ్ బస్తీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కాంగ్రెస్ నేత, జీహెచ్‌ఎంసీ మాజీ ఫ్లోర్ లీడర్ దిడ్డి రాంబాబు, పార్టీ నేతలు గరిగంటి రమేష్, పులి జగన్‌లు పాల్గొని బస్తీ ప్రజలకు సహకరించారు. అర్హులైన ప్రజలందరూ గృహజ్యోతికి దరఖాస్తు చేసుకోవాలని వారు సూచించారు.

పారిశుద్ధ్య సిబ్బందికి దుస్తుల పంపిణీ

కాచిగూడ: ప్రముఖ స్వాతంత్య్ర సమరయోధురాలు సరోజినినాయుడు జయంతిని పురస్కరించుకుని బీజేపీ నేత గాంధే సుధాకర్ జీహెచ్‌ఎంసీ పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీహెచ్‌ఎంసీ స్వీపర్స్ నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో నిరంతరం శ్రమిస్తారని, అలాంటి వారిని గౌరవించుకోవడం మన కనీస బాధ్యత అని అన్నారు. ప్రజల క్షేమం కోసం జీహెచ్‌ఎంసీ కార్మికులు నిస్వార్థంగా సేవలందిస్తున్నారన్నారు. జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఈ వేడుకలను నిర్వహించడం మహిళాశక్తిని ప్రోత్సహించడమేనన్నారు.

పుల్వామా అమర జవాన్లకు ఘన నివాళి

కొవ్వొత్తులతో ర్యాలీ ప్రదర్శన

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: పుల్వామా ఉగ్రవాదుల దాడిలో 40 మంది సీఆర్‌పీఎఫ్ జవాన్లు మృతి చెందడం బాధాకరమని, ఉగ్రవాదుల చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని జమ్మూ కాశ్మీర్ మాజీ డీజీపీ కొండవీటి రాజేంద్రకుమార్ అన్నారు. బుధవారం సాయంత్రం సుందరయ్య పార్కులో పుల్వామాలో మృతి చెందిన అమర జవాన్లకు క్యాండిల్స్‌తో నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా రాజేంద్రకుమార్ మాట్లాడుతూ.. 2019 ఫిబ్రవరి 14న జరిగిన ఉగ్రవాదుల దాడిలో సిఆర్‌పిఎఫ్ జవాన్లు మృతి చెందారని దాన్ని జాతీయ బ్లాక్ డేగా నిర్వహించడం ఆహ్వానించదగ్గ విషయమన్నారు. పి.బి.రావు, సీనియర్ జర్నలిస్టు రాయుడు, సిల్వేరు శ్రీశైలం, న్యాయవాది ప్రశాంత్, ఇంటర్నేషనల్ వాకర్స్ మాజీ అధ్యక్షుడు నాగభూషణం, పార్కు మాజీ అధ్యక్షుడు అంబటి శ్రీనివాస్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులున్నారు.

ఆకట్టుకున్న ఘంటసాల గానవిభావరి

చిక్కడపల్లి: సుస్వర సుగణ కళాభారతి, రవిమన్యు ఆర్ట్ ఆధ్వర్యంలో త్యాగరాయగానసభలో నిర్వహించిన ఘంటసాల గానవిభావరి ఆకట్టుకుంది. అమరగాయకుడు ఘంటసాల 50వ వర్ధంతి సందర్భంగా బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో రవిమన్యు, మధుబాపుశాస్త్రి, శ్రీనివాస్, సుధీర్‌కుమార్, వేలూరి రామకృష్ణరావు, త్రినాథరావుతోపాటు పలువురు గాయనీగాయకులు గీతాలు ఆలపించారు. నగర బీజేవైఎం మాజీ అధ్యక్షుడు ఎ.వినయ్‌కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొని చిన్నారులకు జ్ఞాపికలను బహూకరించారు. వంశీ రామరాజు, నిర్వాహకులు రవిమన్యు, బీజేపీ నేత మల్లెపూల వెంకటరమణ, పురుషోత్తంగౌడ్, ఆనంద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న విద్యార్థుల నాటక ప్రదర్శన



సీతారామలక్ష్మణ వేషధారణలో..

అంబర్‌పేట్: డీడీ కాలనీలోని బచ్‌పన్ అకడమిక్ హైట్స్ పాఠశాల వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. బుధవారం జరిగిన ఈ వేడుకల్లో చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు, నృత్యాలు అలరించాయి. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా పాఠశాల రీజనల్ డైరెక్టర్ శ్రీకాంత్‌రెడ్డి హాజరై విద్యార్థులను అభినందించారు. ప్రతిభ ఉన్న విద్యార్థులను తాము అన్ని విధాలుగా ప్రోత్సహిస్తామన్నారు. పాఠశాల డైరెక్టర్లు రూపారెడ్డి, కౌశిక్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్స్ సులక్షణ, యామిని ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.